# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ❖ భూములు గుంజుకునేందుకే ధరణి వద్దంటున్రు..



భైంసాటౌన్, నవంబర్ 24 : ధరణి అమలు చేయడం వల్ల భూ సమస్యలు చాలా వరకు పరిష్కారమైనయ్. ఇప్పుడు దళారీ వ్యవస్థ ముచ్చటనే లేదు. ధరణిని తీసేస్తమని కాంగ్రెసోళ్లు చెప్పడం కరెక్ట్ కాదు. అలా అయితే మళ్లా భూముల కోసం కొట్లాటలు అయితయ్. దళారీ వ్యవస్థ పెరుగుతుంది. చేయి తడపనిదే పని కాదు. ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తది. ఇప్పుడున్న ధరణి ఎంతో మంచిగున్నది. ధరణితో దొంగ రిజిస్ట్రేషన్లు అయితలేవు. గత ప్రభుత్వాలున్నప్పుడు భూమి ఒకరిది. రికార్డుల్లో పేరు ఇంకొకరిది ఉండేది. అక్కడ కిరికిరి మొదలైందంటే అది ఒడిసేది కాదు. తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ చెప్పులరిగేలా తిరుగుడు, లంచం ఇచ్చుడు ఉండేది. రైతుల పేర్లు మాయం అయి పెద్ద పెద్ద లీడర్ల పేర్లు, వాళ్ల ఇంట్లోళ్ల పేర్లు రికార్డులకు ఎక్కేది. అది మార్చాలని వాళ్ల దగ్గరకు పోయేది. ఆఫీసోళ్లు వాళ్ల మాట తప్ప ఇంకొకలు చెప్పేది ఇనకపోతుండే. ధరణితో ఇప్పుడు అసొంటి బాధలు మొత్తం పోయినయ్. విరాసత్ చేయాలన్నా, భూమిని పంచాలన్నా అందరూ కలిసి ఆఫీసుకు పోయి సారు ముందట ఒప్పుకుంటనే అయితాంది. రైతుల భూములు గుంజుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తమని అంటున్రు, కాంగ్రెస్‌ను నమ్మితే తలకాయ నొప్పే.

**- కత్తి గంగాధర్, కామోల్**

### ❖ దోచుకునుడు.. దాచుకునుడే వాళ్ల పని..



భైంసా, నవంబర్ 24 : గత ప్రభుత్వాల హయాంలో లంచాలు ముడితేగాని భూములు మార్పిడి అయ్యేవి కావు. దాని నుంచి రైతులకు విముక్తి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకవచ్చింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేసి పాత పద్ధతి మాదిరిగా పటేల్ పట్వారీ వ్యవస్థను తీసుకవస్తామంటున్నది. దీని వల్ల అంతా దాచుకోవడం, దోచుకోవడమే అవుతుంది. రికార్డులో భూ యజమాని పేరు మాత్రమే ఉండాలి. అట్లయితే అతనికి స్వేచ్ఛ.. భూమికి భద్రత. భూమి ఒకరిదైతే రికార్డులో మరో కలమ్ పెట్టుడు ఎందుకు. ఇద్దరి మధ్య కిరికిరి పెట్టుడు ఎందుకు. పాత రోజులు మర్చిపోయినమా. మళ్లా.. పనిజేత్తమంటే ఒప్పుకుంటమా. కాంగ్రెసోళ్లకు అదేపని.

**- ప్రకాశ్, రైతులు**

## ధరణి రద్దు చేస్తామనడంతప్ప

# కాంగ్రెస్‌నే రద్దు చేస్తాం..

- ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదు
- ఇప్పుడు ఇబ్బందుల్లేకుండా పనులు అయితున్నయ్
- మళ్లా పాతరోజులు తెస్తామంటే ఒప్పకోం..
- తేల్చిచెప్తున్న అన్నదాతలు

**ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి రూపాయి ఖర్చు లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. మీ సేవ కేంద్రంలో ధరణి పోర్టల్‌లో భూమికి ఉన్న విలువ ప్రకారం ఆన్‌లైన్‌లో పైసలు కడితే చాలు. మిగతా వారికెవరికీ పైసలు ఇవ్వాల్సిన అవసరం లేకుండానే రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. భూముల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో ఉండడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. మా కష్టాలను తీర్చిన సీఎం కేసీఆర్‌ను కాదని ఇంకొకరికి అధికారం కట్టబెట్టే ప్రసక్తే లేదు. ధరణి వ్యవస్థను రద్దు చేస్తామన్న కాంగ్రెసోళ్లను మేము రద్దు చేస్తాం.**

### ❖ రైతులను నిండా ముంచుటానికే..



ముధోల్, నవంబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ధరణితో రైతుల భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే తప్ప ఏనాడూ మంచి జరగలేదు. రైతులు సుఖంగా ఉన్న సమయంలో ధరణి రద్దు చేసి భూమాత తెస్తామంటూ అనడం హాస్యాస్పదం. ఇది రైతులను ముంచడానికి ఉపయోగపడుతుంది. మాకు భూమాత వద్దు. ధరణియే కావాలి. మళ్లా ఆ గోస పడలేం. లంచాలు ఇచ్చే పరిస్థితి రావద్దు. ఇప్పుడున్న ధరణితో రూపాయి ఖర్చులేకుండా పట్టా పాస్ పుస్తకాలు వచ్చినయ్. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా క్షణాల్లో పని అయిపోతున్నది.

**- ఆరిఫ్, తరోడా, ముధోల్**

### ❖ ధరణిని మారుస్తే అస్తవ్యస్తం..



భైంసా, నవంబర్ 24 : ధరణిని తీసివేయడమంటే రెవెన్యూ వ్యవస్థను తిరిగి అస్తవ్యస్తం చేయడమే అవుతుంది. సీఎం కేసీఆర్ దయతో రూపాయి ఖర్చు లేకుండా పాస్ పుస్తకాలు వచ్చినయ్. లక్షలాది మంది రైతులకు ఎంతో ధైర్యం వచ్చింది. ఆపదకు సొంత భూమి అమ్ముకోవాలన్నా, కొనాలనాన చాలా తేలిక అయ్యింది. కాంగ్రెసోళ్లు ఇంత మంచి సౌలత్‌ను తీసివేయడమంటే మళ్లా లంచాలకు తెరతీయడమే అవుతుంది. అసలు ధరణిని తీసివేయాలని రైతులను ఎవరడిగారని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. వారి స్వలాభం కోసం మాట్లాడడం తప్ప మరేం లేదు. రైతులంటే ఎందుకంత చులకనా. మమ్ములను మళ్లా కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిప్పాలనుకుటున్నరా. అది జరగనివ్వం. మిమ్ములను అధికారంలకు రానియ్యం. అసలు ఓట్లే వెయ్యం.

**- గపూర్, రైతు**

### ❖ భూములు భద్రంగున్నయ్..



తానూర్, నవంబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ధరణి ప్రవేశపెట్టి రైతు బంధు ఇవ్వడంతో రైతులు ధైర్యంగా ఉన్నరు. గత ప్రభుత్వాల హయాంలో పట్వారీలు రైతుల భూములను ఒకరి భూమిని మరొకరిపై పట్టా చేసేవారు. ధరణి తేవడం వల్ల రైతుల భూములు భద్రంగా ఉన్నయ్. వ్యవసాయ భూములపైన అనుమానం ఉంటే మీ సేవకు పోయి చూసుకుంటే నిమిషంలో భూమి ఉందా..? లేదా..? అన్న పూర్తి సమాచారం తెసుస్తున్నది. అవసరం కోసం భూములు అమ్మాలన్నా, కొనాలన్నా తాసిల్దార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవడం సంతోషంగా ఉంది. అందుకే ధరణి ఉండాలి. మరోసారి కేసీఆర్ ప్రభుత్వమే రావాలి.

**- చంద్రశేఖర్, రైతు, వడొనా**

### ❖ ముడుపు అందనిదే పనికాదు..



తానూర్, నవంబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితోనే భూముల కొనుగోళ్లు, అమ్మకాలు సులభతరం అయ్యాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో భూముల కొనుగోలు, అమ్మకాలు ఆలస్యంగా అయ్యేవి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుల తరబడి తిరిగే పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే దళారులను పట్టుకోవాల్సిందే. లేకుంటే పని కోసం చెప్పులరిగేలా వారి చుట్టూ తిరగాల్సిందే. ఏ చిన్న సమస్య వచ్చినా తిరుగుడే తిరుగుడు. ముడుపులు అందనిదే పని అయ్యేది కాదు. ఇప్పుడు ధరణితో ఆ సమస్యలు పూర్తిగా తొలగిపోయాయి. సీఎం కేసీఆర్ ముందు చూపుతో భూముల వివరాలు తెలుసుకోవడం కూడా సులభతరంగా మారింది.

**- బండారే పోషెట్టి, బెల్ తరోడ**

### ❖ మళ్లా పాతరోజులు వస్తయ్..



కుభీర్, నవంబర్ 24 : తెలంగాణ సర్కారు రైతులకు ఎలాంటి కష్టాలు, ఇబ్బందులు లేకుండా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను అధికారంలోకి వస్తే తీసేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారు. ధరణిని తీసేస్తే పాత రోజులే మళ్లా వస్తాయి. వామ్మో ఆ రోజులు గుర్తుకువస్తేనే బాధేస్తున్నది. ఆ ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుడు. ఆ కష్టాలు మర్చిపోలేనివి. రైతులకు ధరణితో మేలు జరిగిందే తప్ప హాని కలుగలేదు. అసలు మీరు అధికారంలోకి ఎట్లా వస్తారు. ఏం చేశారని మీకు ప్రజలు ఓట్లు వేస్తారు. నిమిషాల వ్యవధిలో ఎవరి ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ అయిపోతుంది. మా భూములకు భద్రత ఏర్పడింది. మేమందరం మళ్లా కేసీఆర్‌కే పట్టం కడతాం.

**- షేక్ షఫీ, రైతు, కుభీర్**